

కరుణకుమారికి రూ.5 లక్షల ప్రోత్సాహకం




అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత అంధుల మహిళా జట్టు టీ 20 వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించిన కరుణకుమారికి కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ.5 లక్షల ప్రోత్సాహకం ప్రకటించారు. ఈ మేరకు దివ్యాంగుల సంక్షేమశాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరుణకుమారి విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని. విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులను ప్రోత్సహించిన హర్షను మంత్రి అభినందించారు.

భూ సేకరణ దారికొచ్చేనా?

మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణానికి నిబంధనల అడ్డంకి

- రిజిస్ట్రేషన్‌కు స్టాంపు డ్యూటీ మెలిక
- అంతేసి మొత్తం తాము ఎందుకు కడతామంటున్న యజమానులు
- గిఫ్ట్ డీడ్ కింద ఇవ్వాలని వీఎంఆర్‌డీఏ ఒత్తిడి
- కలెక్టర్ వద్దకు పంచాయితీ
- ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇస్తే తప్ప ముందుకు కదలని పనులు



వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్ మ్యాప్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం చేస్తూ విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి భూముల సేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది. మొత్తం ఏడు రహదారులను విమానాశ్రయం ప్రారంభించే నాటికి పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో రహదారుల విస్తరణకు అవసరమైన భూమిని ఇవ్వడానికి కొంతమంది ముందుకువచ్చారు. వాటిని వీఎంఆర్‌డీఏ పేరిట రిజిస్టర్ చేసే విషయంలో నిబంధనలు అడ్డంకిగా మారాయి. దాంతో ఇప్పటివరకూ ఒకే ఒక్క రిజిస్ట్రేషన్ జరిగింది. నిబంధనలు మారిస్తే తప్ప భూముల బదిలీ కాని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఏం చేయాలా?...అని అధికారులు మథనపడుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ రహదారులకు మొత్తం 700 మంది నుంచి భూములు సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతిఫలంగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి స్పందించి 300 మంది వరకు ముందుకువచ్చారు. ఆయా భూములను వీఎంఆర్‌డీఏ పేరిట రిజిస్టర్ చేస్తే...ఆ తరువాత టీడీఆర్ ఇచ్చి పనులు మొదలుపెడతారు. ఈ విధంగా డాక్యుమెంట్ రాసుకొని ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే...అధికారులు అన్నీ పరిశీలించి, దానికి నాలుగు శాతం కన్వేయన్స్ స్టాంపు డ్యూటీ, 0.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చెల్లించాలని సూచించారు. రైతులు ఇచ్చేవి వ్యవసాయ భూములైనా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నందున చదరపు గజాల్లోనే లెక్కిస్తున్నారు. ఇలా 500 చ.గ. స్థలం వీఎంఆర్‌డీఏ పేరిట రిజిస్టర్ చేయడానికి (గజం విలువ రూ.20 వేలు అనుకుంటే) సుమారు రూ.4.5 లక్షలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. తమ భూములు తీసుకోవడమే కాకుండా, మళ్లీ లక్షల రూపాయలు కట్టమంటే ఎక్కడ తెస్తామంటూ వెనక్కి వెళ్లిపోతున్నారు.

గిఫ్ట్ డీడ్ చేయాలని అధికారుల ఒత్తిడి

ఈ భూములు రహదారుల నిర్మాణానికి ఇస్తున్నారు కాబట్టి 'గిఫ్ట్ డీడ్' కింద రిజిస్టర్ చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు ఒత్తిడి పెడుతున్నారు. ఆ విధంగా చేస్తే కేవలం 0.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ (500 గజాలకు రూ.50 వేలు) చెల్లిస్తే ... మిగతా 6వ పేజీలో

విజయశ్రీ బ్లడ్ సెంటర్‌పై కొరడా

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండడంతో ఉన్నతాధికారుల చర్య

- ఔషధ నియంత్రణ, పరిపాలన విభాగం తనిఖీల్లో లొసుగులు బహిర్గతం
- అర్హులైన సిబ్బంది లేకపోవడంతోపాటు రక్తాన్ని శుద్ధి చేయడంలో తగిన ప్రమాణాలు పాటించడం లేదని గుర్తింపు



బ్లడ్‌సెంటర్ వద్ద అధికారులు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విజయశ్రీ బ్లడ్ సెంటర్‌పై ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం అధికారులు కొరడా ఝుళిపించారు. రక్తాన్ని శుద్ధి చేయడంలో ప్రమాణాలు పాటించకపోవడం, అర్హులైన సిబ్బంది లేకపోవడం, అనుమతి లేకుండా పరికరాలను మరోచోటకు తరలించడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తూ సెంటర్‌ను మూసివేయించాల్సిందిగా రాష్ట్ర ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు మూడు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బ్లడ్ బ్యాంకుల్లో ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మహారాణిపేటలోని విజయశ్రీ బ్లడ్ సెంటర్‌కు వెళ్లిన అధికారులకు అక్కడి పరిస్థితులను చూసి కళ్లు బైర్లు కమ్మాయి. సాధారణంగా బ్లడ్ బ్యాంక్ నిర్వహించాలంటే తప్పనిసరిగా మెడికల్ ఆఫీసర్, టెక్నీషియన్, స్టాఫ్ నర్సు ఉండాలి. అయితే, విజయశ్రీ సెంటర్‌లో టెక్నీషియన్ తప్ప ఎవరూ లేరు. అలాగే, రక్తాన్ని శుద్ధి చేసే పరికరాలను ... మిగతా 6వ పేజీలో

హోటళ్ల అరాచకం


నిల్వ ఆహారం

రోజుల తరబడి ఆహారం నిల్వ

వేడి చేసి వడ్డిస్తున్న నిర్వాహకులు

- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల తనిఖీల్లో బహిర్గతం
- వందలాది కిలోల నిల్వ ఆహారం గుర్తింపు
- కేసులు నమోదు, జరిమానా విధింపు
- అయినా కానరాని మార్పు
- రుచి కోసం కెమికల్స్, టేస్టింగ్ సాల్ట్స్ వినియోగం
- ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్న వైద్యులు
- బయట ఆహారానికి దూరంగా ఉండాలని సూచన


హోటల్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు



విశాఖపట్నం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): **నరసింహనగర్‌లో గల 'ముంతాజ్' హోటల్‌లో ఈ ఏడాది జూన్ నెలలో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి కుళ్లిపోయిన కోడిగుడ్లు, దుర్వాసన వెదజల్లుతున్న చికెన్, చేప, రొయ్య వంటకాలను గుర్తించారు. హోటల్‌పై కేసు నమోదు చేశారు.**

- ఆగస్టు ఒకటి, రెండు తేదీల్లో నగరంలోని 40 హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి కిలోల కొద్దీ నిల్వ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 17 హోటళ్లలో అత్యంత దారుణ స్థితిలో ఉన్న ఆహారాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు.
- ఆగస్టు 22న ఎంవీపీ కాలనీలోని 'మిసెస్ ఆహా ఏమి రుచులు రెస్టారెంట్‌లో అధికారులు మూడు రోజులకు మించి నిల్వ ఉన్న 85 కిలోల చికెన్, మటన్, రొయ్య, చేపతోపాటు చేసిన వంటకాలను గుర్తించారు.
- ఈ నెల 11న నరసింహనగర్‌లోని 'సెలబ్రేషన్స్'లో 12.3 కిలోల నిల్వ ఆహార పదార్థాలను గుర్తించారు. ఇందులో చికెన్, మటన్, బిర్యానీలతోపాటు ఇతర ఆహార పదార్థాలు ఉన్నాయి.
- 22న ఇసుకతోట సమీపంలోని షైరెస్టారెంట్‌లో అధికారులు 30 కిలోల నిల్వ ఆహార పదార్థాలను గుర్తించారు.

...ఇలా నగరంలోని ఏ హోటల్, రెస్టారెంట్‌లో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు తనిఖీ చేసినా నిల్వ ఆహార పదార్థాలు లభిస్తున్నాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహారాన్ని నిర్వాహకులు వేడి చేసి వినియోగదారులకు వడ్డిస్తూ వారి ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నా, కేసులు నమోదుచేస్తున్నా వారి తీరులో ఎలాంటి మార్పు రావడం లేదు.

దాడులు చేసినా మారని తీరు..

నగర పరిధిలో పెద్ద, చిన్నా కలిపి సుమారు వెయ్యికిపైగా రెస్టారెంట్లు, ... మిగతా 6వ పేజీలో

కొండపై ఆయనదే పెత్తనం

ఇదీ సింహాచలం దేవస్థానంలో పరిస్థితి

- తాజాగా అర్చకులకు బదిలీలు
- మరో పది మందికి స్థానచలనం
- ప్రధాన అర్చక పోస్టు వివాదంపై మౌనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)ను నియమించడంలో ప్రభుత్వం శ్రద్ధ పెట్టకపోవడంతో అక్కడ పాతుకుపోయిన ఓ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈఓ) చక్రం తిప్పుతున్నారు. దేవదాయ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాతకు ఈఓగా ఇటీవలె అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆమెకు దేవస్థానం వ్యవహారాలపై పూర్తి అవగాహన లేకపోవడంతో సీనియర్ ఏఈఓ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. తాజాగా మంగళవారం పది మంది ఉద్యోగులను ఒక విభాగం నుంచి మరో విభాగానికి, అలాగే అర డజను మంది అర్చకులను ఒక ఆలయం నుంచి ఇంకో ఆలయానికి సదరు ఏఈఓ బదిలీ చేశారు. అటు హైకోర్టు, ఇటు దేవదాయ శాఖ కమిషనర్ ప్రధాన అర్చక



పోస్టు వివాదం తేల్చాలని స్పష్టం చేసినా దాని గురించి మాత్రం పట్టించుకోకవడం లేదు. ఆ పోస్టు ... మిగతా 6వ పేజీలో

స్టూడెంట్ అసెంబ్లీలో డిప్యూటీ సీఎంగా నగర విద్యార్థి

- మరొకరు చీఫ్ మార్షల్...
- నేడు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడలో నిర్వహించనున్న స్టూడెంట్ అసెంబ్లీలో విశాఖ విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కింది. అసెంబ్లీలో డిప్యూటీ సీఎంగా శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కోడి యోగి వ్యవహరిస్తారు. అలాగే సభాపతికి సహాయం చేసే చీఫ్ మార్షల్‌గా అక్కయ్యపాలెం ఎన్జీవో కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వి. హర్షవర్ధన్ విధులు నిర్వహించనున్నారు. జిల్లా నుంచి ఎంపికైన ఎనిమిది మందిలో మరో ఐదుగురు ఎమ్మెల్యేలుగా, ఒకరు మార్షల్‌గా అసెంబ్లీకి హాజరవుతారు. ఇదిలావుండగా బుధవారం జిల్లాలో అన్ని ... మిగతా 6వ పేజీలో

నేడు జిల్లాలో శాసనసభ అంచనాల కమిటీ పర్యటన

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ఐదు రోజుల పర్యటన నిమిత్తం శాసనసభ అంచనా కమిటీ మంగళవారం రాత్రి నగరానికి చేరుకుంది. కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు నేతృత్వంలో బుధవారం ఉదయం సింహాచలం వరాహనరసింహస్వామిని దర్శించుకుని ఈవో, అధికారులతో సమావేశమవుతారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అధికారులతో సమా వేశమై 2019-20, 2021-22 ఆర్థిక సంవత్సరాల పనులపై చర్చిస్తారు. ఆ తరువాత పర్యాటక ప్రాంతాలు సందర్శించి విజయనగరం జిల్లా వెళతారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణోత్సవం

సింహాచలం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యల్యాణోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ వేదికపై ఉంచారు. అనంతరం కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

భీమునిపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాలిక అదృశ్యం కేసును 24 గంటల్లో భీమిలి పోలీసులు ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 13 ఏళ్ల బాలిక సోమవారం ఉదయం ఇంట్లోనే ఉంటూ అదృశ్యమైంది. ఆమె తల్లిదండ్రులు ఎంత వెతికినా జాడ తెలియకపోడంతో సోమవారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భీమిలి పోలీసు సీఐ బి.తిరుమలరావు సాంకేతిక పరిజ్ఞానంతో అదృశ్యమైన బాలిక నగరంలోని ఏ ప్రాంతంలో ఉన్నారో గుర్తించి, పోలీసు సిబ్బందిని అక్కడకు పంపించి, క్షేమంగా బాలికను స్టేషన్‌కు రపించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్‌రాజ్, హెచ్‌సీ శ్రీదేవిలు భద్రంగా బాలికను తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. భీమిలి పోలీస్ స్టేషన్ అధికారులను ఆ శాఖ నగర ఉన్నతాధికారులు అభినందించారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జయప్రదం చేయాలి

తగరపువలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) వందేళ్ల ఉత్సవాలు డిసెంబరు 26న నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. తగరపువలస కార్యాలయంలో మాట్లాడుతూ 1925, డిసెంబరు 26న సీపీఐ ఏర్పడిందని, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో మార్పుల కోసం ఉద్యమాలు చేస్తున్నదన్నారు. అంటరానితనం, కుల, మత వివక్షకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపుతూ అనేక దురాచారాలను నిర్మూలించడానికి కృషి చేసిందన్నారు. దేశంలో అన్ని ప్రాంతాలలో శత జయంతి వేడుకల్ని నిర్వహిస్తున్నారని తగరపువలస చిట్టివలసలో నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎం.డి.బేగం, ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, మాజీ కౌన్సిలర్లు చిల్ల నర్సింహులు, మావూరి సన్యాసమ్మ ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, మొర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

భీమునిపట్నం (రూరల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం చిప్పాడలో మంగళవారం అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రామాలయం హనుమాన్ విగ్రహాన్ని మేళతాళాలలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక భజనలు, కోలాటం వంటి నృత్య రూపకాలను మహిళలు ప్రదర్శించారు. గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆంజనేయ భక్తులు కె.రామిరెడ్డి 200 హనుమాన్ చాలీసా పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అప్పారావు, గ్రామ పంచాయతీ సభ్యులు రమణ, చిట్టిబాబు అరుణ, రామమూర్తి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ దంపతులు శివాజీ, ఈశ్వరమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు గ్రామస్థులు, పాల్గొన్నారు.

కేథరిన్ విద్యార్థికి ఫుట్‌బాల్‌లో స్వర్ణం



భీమునిపట్నం (రూరల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన 14 ఏళ్లలోపు బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో భీమిలి మండలం మూలకుద్దు కేథరిన్ పాఠశాలకు చెందిన బి.జీవన్‌కుమార్ జట్టుకు బంగారుపతకం లభించింది. జీవన్‌కుమార్ జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యాడు. డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని విద్యాసంస్థల అధిపతి ఆలివర్ రాయి తెలిపారు ఈ మేరకు మంగళవారం ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విద్యార్థిని అభినందించారు. ఆటల పోటీల్లో తమ విద్యాసంస్థకు రెండో స్థానం లభించిందన్నారు.

పీఎఫ్ బకాయిలపై ప్రాంతీయ కమిషనర్‌కు ఫిర్యాదు

తగరపువలస, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం 440 మంది కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను చెల్లించలేదని ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కేవీ నర్సింహరాజు, ప్రతినిధులు మంగళవారం పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అవినాష్‌కు ఫిర్యాదు చేశారు. వీరికి రూ.44 లక్షలు చెల్లించకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. మిల్లు యాజమాన్యం ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపుల కోసం కొంతమందికి సెంట్రల్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ ఆధ్వర్యంలో చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. ఆయనతో పాటు ఐఎన్‌టీయూసీ నాయకులు ఎరుసు సోమిరెడ్డి, అప్పలచిట్టి, చిల్ల రాజిరెడ్డి తదితరులు ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

హక్కులపై అవగాహనతోనే మహిళలకు రక్షణ

» మండల లీగల్ అథారిటీ చైర్మన్ సౌజన్య



న్యాయ విజ్ఞాన వేదికలో మాట్లాడుతున్న జడ్జి సౌజన్య

భీమునిపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను అరికట్టడానికి స్త్రీలు హక్కుల పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్, మండల లీగల్ అథారిటీ చైర్మన్ సౌజన్య అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మండల లీగల్ అథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్త్రీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కాకుండా విద్యా పరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. స్త్రీలపై లైంగిక వేధింపులు, మహిళలపై అత్యాచారాలు, గృహ హింసలు ఎక్కువై పోతున్నాయన్నారు. ఈ సమస్యలన్నింటిని నిర్మూలించడానికి ఐక్యరాజ్య సమితి నవంబరు 25న స్త్రీ హక్కుల పరిరక్షణ, స్త్రీ హింస వ్యతిరేక దినంగా పాటించాలని తీర్మానించారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అండగా జాతీయ మహిళా కమిషన్ అందుబాటులో ఉందన్నారు. సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, బార్ అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి డి.కనకమహాలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భీమిలి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ది సన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కె.సోహిల్, బి.మోక్షశ్రీలు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు ఇరువురిని ఆ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు నెట్ బాల్ పోటీలు నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగాయి. ఈ పోటీల్లో అత్యంత నైపుణ్యం ప్రదర్శించడంతో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు సోహిల్, మోక్షశ్రీలకు ఈనెల 27 నుంచి 29 వరకూ పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు శృంగవృక్షం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగనున్న నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం కలిగిందని శ్రీనివాసరావు వివరించారు.

శక్తియాప్‌పై మహిళలకు అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న భీమిలి పోలీసులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం తాళ్లవలసలో మంగళవారం భీమిలి పోలీసులు శక్తియాప్‌పై ఈ గ్రామానికి చెందిన మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. పోలీసు నార్త్ సబ్ డివిజన్‌కు చెందిన టీం సభ్యులు ఈ అవగాహన కలిగించారు. ఈ యాప్ ఉండటం వల్ల మహిళలు ఎంతో రక్షణ ఉంటుందని, ఆపద సమయంలో ఈ యాప్ ద్వారా పిర్యాదు చేయవచ్చని ఏఎస్‌ఐ పి.సుశీల, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలియజేశారు. మొబైల్ ఫోను ఉన్న మహిళలంతా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కొంతమంది ఫోన్లలో యాడ్‌ను డౌన్‌లోడ్ చేసి చూపించారు. కార్యక్రమంలో నార్త్ సబ్ డివిజన్ పోలీసులతో పాటు భీమిలి పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవాళికి మనుగడ

» సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ వి.గోపాల్‌గౌడ



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌గౌడ

డాబాగార్డెన్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన నీరు, గాలి కలుషితమైపోతున్నాయని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల్‌గౌడ స్పష్టం చేశారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఆ దిశగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కలుషితమవుతున్న నదులు, ఆనకట్టలు, చెరువులను పరిరక్షించుకోవాలని, స్వచ్ఛమైన గాలి, తాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. చైనా, అమెరికా దేశాల కంపెనీల కారణంగా గ్లోబల్ వార్మింగ్ పెరుగుతోందన్నారు. కాలుష్య నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం కాకముందు ఆరిలోవలో ఉన్న డంపింగ్‌యార్డ్, పర్యావరణంపై మాట్లాడారన్నారు. అయితే ప్రస్తుతం పర్యావరణంపై ఆయన ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. సత్యం కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని పిలుపునిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నామన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పునరుద్ధరణ కేవలం ప్రభుత్వాల వలన మాత్రమే సాధ్యం కాదన్నారు. నిజమైన మార్పు గ్రామం, పంచాయతీ, వార్డు, స్థానిక సంస్థలస్థాయిలో ఉన్న ప్రజల నుంచి రావాలన్నారు. అనంతరం బొలిశెట్టి సతీమణి నాగమణి మృతికి నివాళులర్పించారు.

దుకాణదారులకు న్యాయం చేయాలని వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతి పత్రం అందిస్తున్న కూటమి నాయకులు

మధురవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధురవాడ కూడలిలో నిర్మించనున్న ఫుట్‌వోవర్ బ్రిడ్జి కారణంగా దుకాణాలు తొలగిస్తే ఉపాధి కోల్పోతామని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు హైవే దాటడానికి ఇబ్బంది పడుతున్న కారణంగా మధురవాడలో ఫుట్‌వోవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ వంతెన మెట్ల ల్యాండింగ్ కారణంగా మధురవాడ మార్కెట్ వైపు సుమారు 26 దుకాణాలు తొలగించవల్సి వస్తోంది. ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు దుకాణాలు తొలగిస్తే కుటుంబాలత వీధిన పడతామని ఎమ్మెల్యేకు తమ గోడును వివరించారు. దుకాణాలు కోల్పోయిన వారికి వ్యాపారలు చేసుకోవడానికి స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, 7వ వార్డు జనసేన అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు, 7వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కానూరి అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

బాందేవుపురం పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి రాజు



బాందేవుపురంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి రాజు

పద్మనాభం- రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి, రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని బాందేవుపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సాగి కృష్ణమూర్తి రాజు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం బాందేవుపురం గ్రామంలో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'రైతన్న- మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు ఉపయోగపడే పంచసూత్రాలను వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు ఈ ఐదూ వ్యవసాయంలో పెను మార్పులను తీసుకువచ్చి అన్నదాతకు అన్ని విధాల అండగా ఉంటాయని తెలిపారు. ఈ సదర్భంగా కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలను ఆదుకోవాలి

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

సింహాచలం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదల సంక్షేమానికి రూ.50వేల కోట్ల నిధుల కేటాయించడంతో పాటు ప్రత్యేక ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బి.కరుణాకర రెడ్డి కోరారు. ఆయన సతీసమేతంగా సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇతర సామాజిక వర్గాల అభివృద్ధికి కోట్లు కేటాయిస్తూ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరుపేద ఓసీల సంక్షేమానికి తక్షణం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓసీలకు ఇతర సామాజిక వర్గ పేదలకు సమానంగా ప్రత్యేక ప్రభుత్వ పథకం ప్రవేశ పెట్టాలని కోరారు.

నేడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ప్రారంభం

సింహాచలం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పించాలనే లక్ష్యంతో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతినిధి బి.ఝాన్సీ లక్ష్మీబాయి ఆర్థిక సహాయంతో నిర్మించిన నూతన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ను బుధవారం ప్రారంభిస్తారు. సుమారు రూ.3కోట్ల వ్యయంతో ఉత్తర రాజగోపురం వద్ద నిర్మించిన ఈ కాంప్లెక్స్ వైకుంఠ ద్వార దర్శనం, వార్షిక తిరుకల్యాణోత్సవం, చందనోత్సవం వంటి వార్షిక ఉత్సవాల్లో క్యూలు ఏర్పాటు చేయడానికి దోహదపడుతుంది.

వన్డే మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

» లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ బాగ్చి

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత్, దక్షిణాఫ్రికా మధ్య వచ్చే నెల 6న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఏసీఏ ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణలో లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రధాన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రవేశ ద్వారాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ బాగ్చి మాట్లాడుతూ భద్రతకు ప్రాధాన్యనిస్తూ పార్కింగ్ ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటగాళ్ల భద్రతకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. పక్కా ప్రణాళికలతో ట్రాఫిక్ నియంత్రణ చేపడతామన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఏసీఏతో కలిసి జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులను పాటించనున్నామని, స్టేడియంలో ప్రేక్షకుల సౌకర్యార్థం తాగునీరు అందుబాటులో ఉంచడంతోపాటు పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఈఎస్ఐ అధికారులు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి అటాచ్‌మెంట్ ప్రక్రియ నిలుపుదల కోసం రూ.50 వేలు డిమాండ్ చేసిన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ)కు చెందిన సోషల్ సెక్యూరిటీ అధికారి ఎ.రవికుమార్, రెవెన్యూ రికవరీ అధికారి కె.సాయికుమార్‌ను విశాఖపట్నం సీబీఐ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. భారత ఆహార సంస్థ నిర్వహించే వేలంలో పాల్గొనేందుకు విజయవాడలో ఒకరు శ్రీశివసాయి ఏజెన్సీస్ అనే సంస్థను ప్రారంభించారు. ఈనెల 20వ తేదీన సంస్థ యజమాని ఇంటికి ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ)కు చెందిన సోషల్ సెక్యూరిటీ అధికారి ఎ.రవికుమార్, రెవెన్యూ రికవరీ అధికారి కె.సాయికుమార్ వెళ్లి ఇంటి అటాచ్‌కు నోటీస్ ఇచ్చారు. నోటీస్ నిలుపుదల చేయాలంటే రూ.50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏజెన్సీస్ యజమాని విశాఖపట్నంలోని సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు ఆయన మంగళవారం ఈఎస్ఐ అధికారులకు రూ.50 వేలు ఇస్తుండగా పట్టుకుని విజయవాడలోని సీబీఐ కోర్టులో హాజరుపరిచారు.

కొండపై ఆయనదే పెత్తనం

... 5వ పేజీ తరువాయి

నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టినందుకు ప్రతిఫలం పొందినందున చర్యలకు వెనకాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాజా బదిలీలు

పరిపాలన అవసరాల పేరుతో మంగళవారం కొందరు అర్చకులను బదిలీ చేశారు. ఎంకేవీవీఎన్ యాజులును భైరవస్వామి ఆలయ అర్చకులుగా నియమించారు. కొండపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు ఎస్.సంతోష్‌కుమార్ భైరవస్వామి ఆలయ అభరణాలకు బాధ్యులని అందులో పేర్కొన్నారు. భైరవ స్వామి ఆలయం అర్చకులు కేఎస్‌వీ సుబ్రహ్మణ్యశర్మను పాత టోల్ గేటు వద్దనున్న సిద్ధి వినాయక ఆలయానికి బదిలీ చేశారు. అక్కడ ఇప్పటివరకూ యాజులు పనిచేశారు. వీరిని అటు నుంచి ఇటు మార్చారు. కన్సాలిడేటెడ్ పే అర్చకులైన పి.శ్రావణ్‌కుమార్‌ను కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి వేశారు. రెగ్యులర్ అర్చకులైన సంతోశ్‌కుమార్ అక్కడ ఆభరణాలకు బాధ్యులని పేర్కొన్నారు. కృష్ణాపురం గోశాల వద్ద ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయానికి సంభావన అర్చకుల సేవలు ఉపయోగించుకోవాలని భైరవవాక ఆలయ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఇవి కాకుండా అన్నదానం సత్రం, ప్రసాదాల విభాగం, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, శానిటేషన్ విభాగాల్లో మరో పది మందికి బదిలీలు చేశారు. ఇందులో ఓ వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారని విమర్శలు వస్తున్నాయి. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో పనిచేస్తూ నిత్యం అందరితో ఘర్షణ పడే ఓ ఉద్యోగిని గతంలో విజయనగరం బదిలీ చేశారు. ఇప్పుడు ఆయన్ను తీసుకువచ్చి కొండపై పారిశుద్ధ్యం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సదరు ఏఈఓ తన అనుకున్న వారికి ఏమి చేయడానికైనా వెనుకాడరని, ఈ బదిలీలే దానికి నిదర్శనమని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

స్టూడెంట్ అసెంబ్లీలో డిప్యూటీ సీఎంగా నగర విద్యార్థి

... 5వ పేజీ తరువాయి

పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ వచ్చిన ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులకు పంపినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రతి పాఠశాలలో ఉదయం 11 గంటలకు విద్యార్థులను సమావేశపరిచి రాజ్యాంగ పీఠిక పఠనం చేయించాలని సూచించారు. భారత రాజ్యాంగం ప్రవేశికలో ఉన్న పీఠిక పఠనం గొప్పతనం, ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. స్టేట్ అసెంబ్లీకి జిల్లా నుంచి ఎంపిక చేసిన 21 మందిలో ఎనిమిది మంది విజయవాడ వెళ్లగా, మిగిలిన 13 మందిని బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో సత్కరిస్తారు. ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, పతకం కలెక్టర్ అందజేస్తారని డీఈవో తెలిపారు.

విజయశ్రీ బ్లడ్ సెంటర్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

అధికారులకు సమాచారం ఇవ్వకుండానే మరోచోటకు తరలించినట్టు, రక్తాన్ని సేకరించేటప్పుడు రక్తదాతకు సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని తీసుకోవడం లేదని గుర్తించారు. రక్తదాత నుంచి రక్తాన్ని సేకరించిన సమయంలో గానీ, తరువాత గానీ ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రాథమిక చికిత్స అందించే పరిస్థితి అక్కడ లేదు. ఈ సెంటర్‌లో లోపాలను గుర్తించి సమాధానం ఇవ్వాలని కోరుతూ మూడు నెలల కిందట అధికారులు నోటీసులు జారీచేశారు. నెలలు గడిచినప్పటికీ సమాధానం ఇవ్వకపోవడంతో గత నెలలో మరోసారి తనిఖీలు నిర్వహించారు. అప్పటికీ అదే పరిస్థితి కొనసాగడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దానిని ఆధారంగా చేసుకున్న ఔషధ నియంత్రణ, పరిపాలన విభాగం డైరెక్టర్ బ్లడ్ సెంటర్‌ను మూసేయాలంటూ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది సహాయంతో సెంటర్‌ను క్లోజ్ చేశారు.

భూ సేకరణ దారికొచ్చేనా?

... 5వ పేజీ తరువాయి

సరిపోతుందంటున్నారు. ఏదైనా స్థిర, చరాస్తులను కుటుంబ సభ్యుల మధ్యే గిఫ్ట్ డీడ్ చేస్తారు. ఇతరులకు గిఫ్ట్ డీడ్ చేయాలంటే...ఆ ఆస్తిని ఇచ్చినందుకు ప్రతిఫలం ఏమీ తీసుకోకూడదు. ఆ విషయం డాక్యుమెంట్‌లో స్పష్టంగా రాయాలి. అప్పుడే దానికి 0.5 శాతం ఫీజు కట్టించుకుంటారు. కానీ వీఎంఆర్‌డీఏ రాసిన డాక్యుమెంట్‌లో తాము ఆ భూమిని తీసుకుని బదులుగా 'టీడీఆర్' ఇస్తున్నామని పేర్కొంది. అంటే ప్రతిఫలం ఇస్తున్నారు కాబట్టి...దాని విలువ ప్రకారం 4.5 శాతం ఫీజు కట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కలెక్టర్ వద్దకు పంచాయితీ

మాస్టర్‌ప్లాన్ రహదారులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం చెబుతుండడం, ఇక్కడ చూస్తే భూ సేకరణ పూర్తికాకపోవడంతో ఈ పంచాయితీ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి వెళ్లింది. దాంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆయన పిలిపించుకొని మాట్లాడారు. చట్టంలో నిబంధనల ప్రకారమే తాము నడుచుకోవలసి ఉందని, టీడీఆర్ తీసుకునే భూములను గిఫ్ట్ డీడ్ చేయడం వీలు కాదని వారు తేల్చి చెప్పారు. ఎటువంటి ఫీజు లేకుండా ఆయా భూములు రిజిస్టర్ చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. ఇంకా అక్కడి నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. అవి వస్తే తప్ప ఇక్కడ మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణ ప్రక్రియ ముందుకు కదలదు.

హోటళ్ల అరాచకం

... 5వ పేజీ తరువాయి

హోటళ్లు ఉంటాయి. వీటిని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను గుర్తిస్తున్నారు. వారిపై కేసు నమోదుచేసి, జరిమానాలు విధిస్తున్నారు. అయినప్పటికీ హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకుల్లో ఎటువంటి మార్పు ఉండడం లేదు. నిల్వ ఆహారం విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్ల అనుమతులను రద్దు చేస్తే తప్ప మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కానీ, అధికారులకు అనుమ తులు రద్దు చేసే అధికారం లేదు. అందుకే, పెద్దగా ఫలితం ఉండడం లేదు. ఇక అధికారులు తనిఖీలు చేసిన ప్రతి సందర్భంలో పెద్దఎత్తున నిల్వ ఆహారం బయట పడుతున్నప్పటికీ వినియోగదారులు పట్టించుకోవడం లేదు. ఆ హోటళ్లలో తినడానికి వెనుకాడడం లేదు.

తీవ్ర అనారోగ్య సమస్యలు..

రోజుల తరబడి నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నాన్‌వెజ్ ఐటమ్స్‌ను రోజుల తరబడి నిల్వ చేయడం వల్ల ప్రొటీన్ నాణ్యత తగ్గుతుంది. దీనివల్ల టైఫాయిడ్‌తోపాటు డయేరియా బారినపడే అవకాశం ఉంది. అలాగే, తీవ్రమైన కడుపునొప్పి, అల్సర్లు వంటి ఇబ్బందులు వేధించే అవకాశం ఉంది. ఇంకా టేస్టింగ్ సాల్ట్, కొన్నిరకాల రంగులు వినియోగంతో లివర్ సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టేస్టింగ్ సాల్ట్ వినియోగించిన ఆహారం తీసుకోవడం వల్ల ఊబకాయంతోపాటు కిడ్నీ సంబంధిత ఇబ్బందులు ఉత్పన్నమవుతాయని కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్ తెలిపారు.ప్రజలు బయట ఆహారానికి దూరంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లల్లో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లు ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో వినూత్న నిరసన

సిరిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు వినూత్నంగా నిరసన తెలిపారు. కళ్లకు నల్ల రిబ్బను కట్టుకొని దీక్షలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంటును సొంతగనులు కేటాయించాలని, ప్రైవేటీకరణను ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎన్ మాధవి, వై.సత్యవతి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, సుమిత్ర, విమల, సత్యవతి, ఉమాపూర్ణ, పద్మ, అనూరాధ, సంతోషం, మంగవేణి తదితరులు పాల్గొన్నారు.


కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఐద్వా ప్రతినిధులు

అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం : ఎమ్మెల్యే వెలగపూడి

విశాలాక్షినగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం బీచ్‌రోడ్‌లో ఉన్న శ్మశాన వాటికలో సుమారు రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో స్థానికంగా ఉండే సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ డీఈ శ్రీనివాస్, 9వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పొట్నూరు సుబ్బారావు, అక్కరమాని రాంబాబు, బుడుమూరి గోవింద్, గొరికెసనాకరరావు, ఉమ్మడి సుజాత,విశాలాక్షినగర్ సంక్షేమ సంఘం సభ్యులుపాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పరీక్షా కేంద్రాల సమన్వయకర్తలతో సమావేశం

ఎంవీపీ కాలనీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పరీక్షా కేంద్రాల సమన్వయకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోపిపాటి ధర్మారావు పరీక్షలకు సంబంధించిన సూచనలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. ఇగ్నో అదనపు సంచాలకులు ఐశ్వర్యారావు, విజ్ఞానవిహార్ వీసీ పరిరావు నాయుడు పాల్గొన్నారు.

తిరుచానూరు పద్మావతి అమ్మవారి పుష్పయాగానికి పువ్వులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న పుష్పయాగానికి విశాఖ నగరం నుంచి పువ్వులను పంపించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణమండపంలో టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్ ఆధ్వర్యంలో మంగళవారం పుష్ప సంకల్పం నిర్వహించారు. పదిహేను వందల కిలోల పువ్వులు, తులసి మాలలు ఇక్కడి నుంచి పంపించారు. టీటీడీ గార్డెన్ పర్యవేక్షణాధికారి ఎస్.శ్రీనివాసులు విశాఖలోని వేంకటేశ్వరస్వామి భక్తుల హిందూమత ప్రచారక రాసిన లేఖ మేరకు ఈ పువ్వులను సేకరించారు. ఈ కార్యక్రమంలో వెంకన్న భక్తులు పద్మజ, స్వామి, లక్ష్మీ ప్రసన్న, రామలక్ష్మి శశికళ, హేమలత, రాజు, సత్యకుమార్, నర్సింహులు, ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణమండపంలో పుష్ప సంకల్పంలో పాల్గొన్న భక్తులు

సమస్యలు పరిష్కరించండి : కార్పొరేటర్‌కు 15వ వార్డు వాసుల వినతి

వెంకోజీపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులో తీరని సమస్యగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మిగిలిపోయిందని, రోజూ ఎక్కడో ఒక చోట ఆ సమస్య వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం వార్డులోని దుర్గానగర్, సింహాద్రిపురం, శెట్టిబలిజ వీధి, రామాలయం వీధి, ఉమానగర్‌లో జీవీఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ముసురుసిల్ కాలువలు, సిమెంట్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలంటూ స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. దీనిపై కార్పొరేటర్ శ్రీవిద్య స్పందిస్తూ.. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్


సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెల వారీ తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం గోదాములను సందర్శించి ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న ఐద్వా నేతలు, కార్యకర్తలు

సిరిపురం, నవంబరు 25 : మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్ మాధవి, వై.సత్యవతి కోరారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తోన్న పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జీవీఎంసీ విగ్రహం వద్ద మహిళలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులు, ఆడపిల్లలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. మహిళలు ఇంటా, బయట ఏదో ఒకరకంగా హింస, అత్యాచారం, అవమానాలకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ నగరంలో సైతం కిడ్నాప్ కేసులు, వరకట్న వేధింపులు, ప్రేమ పేరుతో దాడులు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఐటీలో విశాఖనగరంలో గోవా సంస్కృతి తేవాలని చేసిన వ్యాఖ్యలు సైతం మహిళలకు ఎంతో అవమానకరమన్నారు. మహిళారక్షణ కోసమని చేసిన చట్టాలు ఉన్నా ఆరులో సరిగా అమలు కాకపోవటం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. పాలక ప్రభుత్వాలు ఇప్పటికైనా ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సభ్యులు సుమిత్ర, వరలక్ష్మి, వేణు, కుమారి, మణి, విమల, లక్ష్మి, ఉమా, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

25 నాటు కోళ్లు చోరీ

ఆరిలోవ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్ పరిధిలో ఒక కోళ్ల ఫారం వద్ద సోమవారం అర్ధరాత్రి 25 నాటు కోళ్లు చోరీ గురయ్యాయి. వాటి యజమాని నారాయణరావు మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి కోళ్లు భద్రపరిచిన షెడ్డు, పెట్టె ఐరన్ గ్రిల్ డోర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. పెట్టెలోని చూడగా మంగళవారం బాధితుడు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మటనా స్థలాన్ని పరిశీలించారు.

కార్పొరేటర్ సాదిక్ ఆరోపణలు అర్థరహితం

తృప్తి క్యాంటీన్ నిర్వాహకులు

బీచ్ రోడ్డు నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయమని తృప్తి క్యాంటీన్ నిర్వహణ తీరుపై 39వ వార్డు జనసేన కార్పొరేటర్ సాదిక్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని క్యాంటీన్ నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తృప్తి క్యాంటీన్ నిర్వాహకులు పివిఆర్‌లక్ష్మి, సిహెచ్ నందిని మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా, మహిళలమన్న వివక్షతో అన్యాయంగా తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కార్పొరేటర్ సాదిక్‌కు తగదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని అనుమతులతో తాము తృప్తి క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వ్యవహారంలో పెద్ద స్కామ్ జరిగిందంటూ జీవీఎంసీలో సాదిక్ ఫిర్యాదు చేస్తూ మీడియా ముందు తమపట్ల అసభ్యకరంగా మాట్లాడటం బాధిపోని నిందలు వేశారంటూ ఆవ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రాథమిక విద్య నుంచే రాజ్యాంగంపై అవగాహన పెంపొందించాలి

వెంకోజీపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బాలల రాజ్యాంగ పలాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు వీవీ వామనరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం, జీవీఎంసీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ల సారథ్యంలో 'బాలల హక్కుల పరిరక్షణలో రాజ్యాంగం పాత్ర'పై రూపొందించిన కరపత్రాలను మంగళవారం కేజీహెచ్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో వామనరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ఆయుధమైనట్టు రాజ్యాంగమేనన్నారు.

సినిమా గైడ్

- ప్రీమియర్ : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.ఎస్.గోపాల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- 12ఎ రైల్వే కాలనీ : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సంగమ్ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.ఎస్.లిటిల్ (శ్రీహరిపురం), సీతా రామయ్య (వడ్లపూడి).
- కాంత : మెలోడీ, శ్రీకన్య-2 (గాజువాక).
- రాజు వెడ్స్ రాంబాయి / మస్తీపోలీసు : జగదాంబ
- శివ / రాజు వెడ్స్ రాంబాయి : శారదా
- పాంచ్‌మినార్ / జిల్లు మీ ఎదవ : రమాదేవి
- సంతాన ప్రాప్తిరస్తు : కన్యా(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- ది గర్ల్ ఫ్రెండ్ : శ్రీవెంకటేశ్వర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 50, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 56, ఆనపకాయ 30, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 26, క్యారెట్ 56, దొండకాయలు 42, బంగాళ దుంపలు 19, ఆరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 50, ములంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, చెట్టు (పెద్ది) 64, క్యాప్సికం (పెద్దది) 38, బీన్స్ (పెద్దవి) 54, కీరదోస 32, క్యాప్సికం 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 50, దేమురు చిక్కుడు 70, గోరు చిక్కుడు 56, కూర పెండలం 36, బ్రకోలీ 45, పనస పొట్టు 180, కొండవనిని 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, ముక్కురా (కట్ట) 4, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.ల్లో)	
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు	
బ్యాగ్	
లైవ్ ధర	98
స్కిన్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

పలు రైళ్లు దారి మళ్లింపు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్‌లో నిర్మాణ పనుల నేపథ్యంలో పలు రైళ్లు వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్ మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. వీటిలో ఫిబ్రవరి 12, 13 విశాఖ-న్యూఢిల్లీ- విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్, జనవరి 29, ఫిబ్రవరి 5, 12న విశాఖ-గాంధీధాం, ఫిబ్రవరి 1, 8న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 6, 9, 13న విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి, ఫిబ్రవరి 8, 11న నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి , ఫిబ్రవరి 1, 8న పూరి-వోకా, ఫిబ్రవరి 4, 11న వోకా-పూరి మళ్లింపు మార్గంలో నడుస్తాయి.

7న జర్నలిస్టుల వన సమారాధన

అక్కయ్యపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో వచ్చే నెల 7న వన సమారాధన నిర్వహించనున్నారు. మధురవాడలోని శిల్పారామం జాతరలో ఈ కర్యక్రమం ఏర్పాటు చేశామని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు హాజరవ్వాలని కోరారు.

రెచ్చిపోతున్న పెట్రోలు దొంగలు

మర్రిపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 53వ వార్డు మర్రిపాలెం ఎఫ్‌సీఐ కాలనీ, శ్రీహర్షనగర్ ప్రాంతాల్లో పెట్రోలు దొంగలు రెచ్చిపోతున్నారు. అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో పార్కింగ్ చేసిన ఉన్న వాహనాల్లో పెట్రోలు దొంగలిస్తున్నారు. ఈనెల 21న శ్రీహర్షనగర్ అపార్ట్‌మెంట్ వద్ద పలు వాహనాల్లో పెట్రోలు తీసివేశారు. మరో బైక్ బ్యాటరీని చోరీ చేశారు. ఎఫ్‌సీఐ కాలనీలో వీధిదీపాలను ఆకతాయిలు రాళ్లతో పగలగొడుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విశ్రాంత అధ్యాపకురాలికి నివాళి

జ్ఞానాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) సెయింట్ జోసెఫ్ పూర్వ ఆఫీస్ మెనేజ్‌మెంట్ విభాగాధిపతి రమణి ధనరాజ్ (65) మంగళవారం అకాల మృతిచెందారు. దీంతో ఆమె భౌతికకాయం వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, అధ్యాపకులు, సిబ్బంది నివాళి అర్పించారు. 40 ఏళ్లుగా అంకితభావంతో సేవలందించారని కొనియాడారు.

శివాజీ సీసీ విజయం

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నిర్వహిస్తున్న వార్షిక లీగ్ టోర్నీలో భాగంగా మంగళవారం కల్నల్ సీకే నాయుడు స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో శివాజీ సీసీ ఎనిమిది వికెట్ల తేడాతో స్టాలిన్ సీసీపై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన స్టాలిన్ సీసీ 42.1 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. అనంతరం శివాజీ సీసీ 32.1 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది.

రహదారికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నక్కవానిపాలెంలో పనులు చేపడుతున్న దృశ్యం

సీతమ్మధార, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూజీడీ, తాగునీటి కొళాయిల కోసం రహదారులను తవ్వి వదిలేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో అధ్వాన రహదారులు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారుల నుంచి స్పందన వచ్చింది. ఈ మేరకు మంగళవారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

భారత్- సౌతాఫ్రికా వన్డే మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత్, దక్షిణాఫ్రికా మధ్య వచ్చే నెల 6న ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఏసీఏ ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణలో లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రధాన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రవేశ ద్వారాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ బాగ్చి మాట్లాడుతూ భద్రతకు ప్రాధాన్యనిస్తూ పార్కింగ్ ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటగాళ్ల భద్రతకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. పక్కా ప్రణాళికలతో ట్రాఫిక్ నియంత్రణ చేపడతామన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఏసీఏతో కలిసి జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులను పాటించనున్నామని, స్టేడియంలో ప్రేక్షకుల సౌకర్యార్థం తాగునీరు అందుబాటులో ఉంచడంతోపాటు పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, ఏసీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవాళికి మనుగడ

- నదులు, ఆనకట్టలు, చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే
- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల్‌గౌడ



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ

డాబాగార్డెన్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవాళికి సమానంగా అందాల్సిన స్వచ్ఛమైన నీరు, గాలి కలుషితమైపోతున్నాయని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల్‌గౌడ స్పష్టం చేశారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఆ దిశగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కలుషితమవుతున్న నదులు, ఆనకట్టలు, చెరువులను పరిరక్షించుకోవాలని, స్వచ్ఛమైన గాలి, తాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. నామమాత్రపు చర్యలు కాకుండా సరైన మార్గంలో చర్యలు చేపట్టాలని సూచించారు. చైనా, అమెరికా వంటి దేశాలకు చెందిన కంపెనీల కారణంగా గ్లోబల్ వార్మింగ్ పెరుగుతోందన్నారు. కాలుష్య నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం కాకముందు ఆరిలోవలో ఉన్న డంపింగ్‌యార్డ్, పర్యావరణంపై మాట్లాడారన్నారు. అయితే ప్రస్తుతం పర్యావరణంపై ఆయన ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. సత్యం కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని పిలుపునిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నామన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పునరుద్ధరణ కేవలం ప్రభుత్వాల వలన మాత్రమే సాధ్యం కాదన్నారు. నిజమైన మార్పు గ్రామం, పంచాయతీ, వార్డు, స్థానిక సంస్థలస్థాయిలో ఉన్న ప్రజల నుంచి రావాలన్నారు. అనంతరం బొలిశెట్టి సతీమణి నాగమణి మృతికి నివాళులర్పించారు.

కనకమహాలక్ష్మి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు



సిద్ధమైన క్యూ లైన్

మహారాణిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మొదటి గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలిరానుండడంతో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు విశేష పూజలు ప్రారంభిస్తారు. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. దీంతో టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటుచేశారు. రూ.500, 200 100లతో పాటు ఉచిత దర్శనాల కోసం కొత్తరోడ్డు రీడింగ్ రూమ్ వైపు, వీఐపీ, వీవీఐపీ, ప్రొటోకాల్ దర్శనాలకు విక్టోరియా ఆస్పత్రి (ఘోషా) వైపు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ, భద్రతా కారణాల నేపథ్యంలో ఉదయం 6 నుంచి 8, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య వీఐపీలు దర్శనం చేసుకోవాలన్నారు. వీఐపీ వాహనాలు టౌన్ కొత్తరోడ్డు చెంగలరావుపేట మీదుగా ఘోషాస్పత్రి సమీపంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ

అక్కయ్యపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్ కాళ్ళవారి తోటలో మంగళవారం సుబ్రహ్మణ్య సమేత మేధా దక్షిణామూర్తి స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. నిర్వాహకులు మహా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ నేతలు ముక్కా కిశోర్‌కుమార్, పోతు సత్యనారాయణ, కాళ్ళ సూర్యప్రకాశ్, బి.కల్యాణి, కొత్తూరు శ్రీనివాసరావు, కొణతాల గోవిందరాజు, మాధవీలత, రమేష్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న జయప్రకాశ్ సాహు

కంచరపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి స్థాయి నుంచే పరిశ్రమల స్థాపనపై అవగాహన కలిగి ఉండాలని సక్సెస్ కంపాస్ ట్రస్టెడ్ గైడ్ సీఈవో జయప్రకాశ్ సాహు పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం పరిశ్రమల వ్యవస్థాపనపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా.కేవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జయప్రకాశ్ సాహు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనలో ప్రభుత్వ సంస్థల తోడ్పాటు, నిధులు, వనరులు సమకూర్చే విధానం, విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారడానికి లక్షణాలను వివరించారు. కేబీవీఎస్ఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసిన సుమన్



సుమన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును మంగళవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సుమన్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. పలు అంశాలపై ఇద్దరు కొద్దిసేపు చర్చించారు.

స్విమ్మింగ్ చాంపియన్ ప్రీతికి అభినందనలు



ప్రీతిని అభినందిస్తున్న దృశ్యం

సీతమ్మధార, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా స్విమ్మింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల విద్యార్థిని బీపీకేఎల్ ప్రీతిని మంగళవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. ఐదు ఈవెంట్లలో గోల్డ్ మెడల్స్ దక్కించుకుని ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడం ఆనందంగా ఉందని కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, అధ్యాపకులు అభినందించారు.

'కాంట్రాక్టర్లకు బకాయిలు సత్వరం చెల్లించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

డాబాగార్డెన్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, కార్యవర్గ సభ్యులు మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు సుమారు రూ.460 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎక్కడ నిధులు అక్కడే వాడుకోవాలని చెప్పినప్పటికీ జీవీఎంసీ ఆదాయం రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోవడంతో బిల్లులు చెల్లింపు జరగడం లేదన్నారు. సీఐఐ సమ్మిట్‌కు కాంట్రాక్టర్లు రూ.50 కోట్లకుపైగా ఖర్చుచేశారని, త్వరలో జరిగే ఐఎఫ్ఆర్‌వంటి పనులకు డబ్బు లేదన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించకుంటే పనులు నిర్వహించలేమని స్పష్టం చేశారు. నిధి పోర్టల్‌తో బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతోందన్నారు. తక్షణం 6 నెలల బిల్లులు చెల్లించాలన్నారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దాల రమేష్, ఉపాధ్యక్షుడు జి.సింహాచలం, కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కయ్యపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ దుక్కిపాటి నందకిశోర్ తెలిపారు. పోర్టు స్టేడియం విశ్వనాథ్ కన్వెన్షన్స్ ఆడిటోరియంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్న వారు, గ్యాస్ట్రిక్ సమస్యలు, బీపీ, షుగర్, ఈసీజీ బీఎంఐ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిశోర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో సేవలందిస్తున్న తనకు విశాఖతో అనుబంధం ఉందన్నారు. ఇక్కడ గతంలో అనేక వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మహిళా శస్త్ర చికిత్స నిపుణురాలు డాక్టర్ దీప్తి టక్కర్, లివ్‌లైఫ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏయూ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని డిసెంబరు 13న నిర్వహించనున్నట్టు అలూమ్ని అసోసియేషన్ (ఏఏఏ) చైర్మన్ కేవీవీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం ఐదు గంటల నుంచి శతాబ్దపు శ్రేష్ఠత, భవిష్యత్తు వాగ్దానం ఇతివృత్తంతో వేడుకలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్‌పర్సన్, మూర్తిట్రస్ట్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరవుతారని, ఈ సందర్భంగా వర్సిటీని సందర్శిస్తారన్నారు.

జాతీయ దత్తత అవగాహన సదస్సు రేపు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న నోవాటెల్ వేదికగా జాతీయ దత్తత అవగాహన కాంక్లేవ్-2025 నిర్వహించను న్నారు. మధ్యాహ్నం మూడ నుంచి ఐదు గంటల వరకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సెక్రటరీ అనిల్ మాలిక్ హాజరుకానున్నారు. ఉదయం నిర్వహించాల్సిన బాల్ వివాహ్ ముక్త భారత్ ప్రత్యేక కార్యక్రమం, కాంక్లేవ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ (సీసీపీ) సమావేశం రద్దు చేశారు.

29న రౌండ్ టేబుల్ సమావేశం

డాబాగార్డెన్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ తరువాత చేపట్టిన సర్వే ప్రకారం రాష్ట్రంలోని బాలల అక్రమ రవాణా, బడి మానేసిన బాలల సంఖ్య పెరిగిందని, ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వానికి తెలిసేలా ఈ నెల 29న బాల వికాస ఫౌండేషన్‌తో కలిసి 'బాలల అక్రమ రవాణా, స్కూల్ డ్రాపౌట్ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామన్నారు. పౌరగ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి స్వచ్ఛంద సంస్థలు, బాలల హక్కుల ప్రతినిధులు హాజరై విలువైన అభిప్రాయాలు తెలపాలని కోరారు. వివరాలకు 90005 50256 నంబరులో సంప్రదించాలని కోరారు.

సీపీఐ ఒత్తిడితోనే ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపన

- ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి శ్రీకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకుమార్

సీతంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఒత్తిడితోనే ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన, కార్మిక చట్టాల రూపకల్పన జరిగిందని, వాటిని నాశనం చేసే దిశగా మోదీ పాలన సాగుతోందని ప్రపంచ కార్మిక సమాఖ్య ఉప ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి శ్రీకుమార్ పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలోనిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి వేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు స్టీల్, బొగ్గు, రక్షణ, బ్యాంక్, బీమా, రవాణా, రైల్వే, విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దేశద్రోహమన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓ బీసీలకు ఉపాధి లేకుండా చేశారని, 26న జరిగే కార్మిక సంఘాల నిరసన రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం జరిగే పోరాటంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోదీ రాజ్యాంగ హక్కులు కాలరాస్తున్నారని, బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడుతున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆదినారాయణ, రావులపల్లి రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య, రాజాన దొరబాబు, ఎం.మన్మథరావు, బూసి వెంకటరావు, కె.సత్యాంజనేయ, నాయుడు, వామనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఈఎస్ఐ అధికారులు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి అటాచ్‌మెంట్ ప్రక్రియ నిలుపుదల కోసం రూ.50 వేలు డిమాండ్ చేసిన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ)కు చెందిన సోషల్ సెక్యూరిటీ అధికారి ఎ.రవికుమార్, రెవెన్యూ రికవరీ అధికారి కె.సాయికుమార్‌ను విశాఖపట్నం సీబీఐ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. భారత ఆహార సంస్థ నిర్వహించే వేలంలో పాల్గొనేందుకు విజయవాడలో ఒకరు శ్రీశివసాయి ఏజెన్సీస్ అనే సంస్థను ప్రారంభించారు. ఈనెల 20వ తేదీన సంస్థ యజమాని ఇంటికి ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐ)కు చెందిన సోషల్ సెక్యూరిటీ అధికారి ఎ.రవికుమార్, రెవెన్యూ రికవరీ అధికారి కె.సాయికుమార్ వెళ్లి ఇంటి అటాచ్‌కు నోటీస్ ఇచ్చారు. నోటీస్ నిలుపుదల చేయాలంటే రూ.50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏజెన్సీస్ యజమాని విశాఖపట్నంలోని సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు ఆయన మంగళవారం ఈఎస్ఐ అధికారులకు రూ.50 వేలు ఇస్తుండగా పట్టుకుని విజయవాడలోని సీబీఐ కోర్టులో హాజరుపరిచారు.

నేడు జిల్లాలో శాసనసభ అంచనాల కమిటీ పర్యటన

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో ఐదురోజుల పర్యటన నిమిత్తం శాసనసభ అంచనా కమిటీ మంగళవారం రాత్రి నగరానికి చేరుకుంది. కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు నేతృత్వంలో బుధవారం ఉదయం సింహాచలం వరాహనరసింహస్వామిని దర్శించుకుని ఈవో, అధికారులతో సమావేశమవుతారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా అధికారులతో సమావేశమై 2019-20, 2021-22 ఆర్థిక సంవత్సరాల పనులపై చర్చిస్తారు. ఆ తరువాత పర్యాటక ప్రాంతాలు సందర్శించి విజయనగరం జిల్లా వెళతారు.

భూ సేకరణ దారికొచ్చేనా?

... 5వ పేజీ తరువాయి

సరిపోతుందంటున్నారు. ఏదైనా స్థిర, చరాస్తులను కుటుంబ సభ్యుల మధ్యే గిఫ్ట్ డీడ్ చేస్తారు. ఇతరులకు గిఫ్ట్ డీడ్ చేయాలంటే...ఆ ఆస్తిని ఇచ్చినందుకు ప్రతిఫలం ఏమీ తీసుకోకూడదు. ఆ విషయం డాక్యుమెంట్‌లో స్పష్టంగా రాయాలి. అప్పుడే దానికి 0.5 శాతం ఫీజు కట్టించుకుంటారు. కానీ వీఎంఆర్‌డీఏ రాసిన డాక్యుమెంట్‌లో తాము ఆ భూమిని తీసుకుని బదులుగా 'టీడీఆర్' ఇస్తున్నామని పేర్కొంది. అంటే ప్రతిఫలం ఇస్తున్నారు కాబట్టి...దాని విలువ ప్రకారం 4.5 శాతం ఫీజు కట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కలెక్టర్ వద్దకు పంచాయితీ

మాస్టర్‌ప్లాన్ రహదారులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం చెబుతుండడం, ఇక్కడ చూస్తే భూ సేకరణ పూర్తికాకపోవడంతో ఈ పంచాయితీ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి వెళ్లింది. దాంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆయన పిలిపించుకొని మాట్లాడారు. చట్టంలో నిబంధనల ప్రకారమే తాము నడుచుకోవలసి ఉందని, టీడీఆర్ తీసుకునే భూములను గిఫ్ట్ డీడ్ చేయడం వీలు కాదని వారు తేల్చి చెప్పారు. ఎటువంటి ఫీజు లేకుండా ఆయా భూములు రిజిస్టర్ చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. ఇంకా అక్కడి నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. అవి వస్తే తప్ప ఇక్కడ మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణ ప్రక్రియ ముందుకు కదలదు.

హోటళ్ల అరాచకం

... 5వ పేజీ తరువాయి

హోటళ్లు ఉంటాయి. వీటిని ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను గుర్తిస్తున్నారు. వారిపై కేసు నమోదుచేసి, జరిమానాలు విధిస్తున్నారు. అయినప్పటికీ హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకుల్లో ఎటువంటి మార్పు ఉండడం లేదు. నిల్ల ఆహారం విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్ల అనుమతులను రద్దు చేస్తే తప్ప మార్పు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కానీ, అధికారులకు అనుమతులు రద్దు చేసే అధికారం లేదు. అందుకే, పెద్దగా ఫలితం ఉండడం లేదు. ఇక అధికారులు తనిఖీలు చేసిన ప్రతి సందర్భంలో పెద్దఎత్తున నిల్వ ఆహారం బయటపడు తున్నప్పటికీ వినియోగదారులు పట్టించుకోవడం లేదు. ఆ హోటళ్లలో తినడానికి వెనుకాడడం లేదు.

తీవ్ర అనారోగ్య సమస్యలు..

రోజుల తరబడి నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నాన్‌వెజ్ ఐటమ్స్‌ను రోజుల తరబడి నిల్వ చేయడం వల్ల ప్రొటీన్ నాణ్యత తగ్గుతుంది. దీనివల్ల టైఫాయిడ్‌తోపాటు డయేరియా బారినపడే అవకాశం ఉంది. అలాగే, తీవ్రమైన కడుపునొప్పి, అల్సర్లు వంటి ఇబ్బందులు వేధించే అవకాశం ఉంది. ఇంకా టేస్టింగ్ సాల్ట్, కొన్నిరకాల రంగులు వినియోగంతో లివర్ సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టేస్టింగ్ సాల్ట్ వినియోగించిన ఆహారం తీసుకోవడం వల్ల ఊబకాయంతోపాటు కిడ్నీ సంబంధిత ఇబ్బందులు ఉత్పన్నమవుతాయని కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్ తెలిపారు. ప్రజలు బయట ఆహారానికి దూరంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లల్లో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లు ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని హెచ్చరించారు.

స్టూడెంట్ అసెంబ్లీలో డిప్యూటీ సీఎంగా నగర విద్యార్థి

... 5వ పేజీ తరువాయి

పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ వచ్చిన ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులకు పంపినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రతి పాఠశాలలో ఉదయం 11 గంటలకు విద్యార్థులను సమావేశపరిచి రాజ్యాంగ పీఠిక పఠనం చేయించాలని సూచించారు. భారత రాజ్యాంగం ప్రవేశికలో ఉన్న పీఠిక పఠనం గొప్పతనం, ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. స్టేట్ అసెంబ్లీకి జిల్లా నుంచి ఎంపిక చేసిన 21 మందిలో ఎనిమిది మంది విజయవాడ వెళ్లగా, మిగిలిన 13 మందిని బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో సత్కరిస్తారు. ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, పతకం కలెక్టర్ అందజేస్తారని డీఈవో తెలిపారు.

విజయశ్రీ బ్లడ్ సెంటర్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

అధికారులకు సమాచారం ఇవ్వకుండానే మరోచోటకు తరలించినట్టు, రక్తాన్ని సేకరించేటప్పుడు రక్తదాతకు సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని తీసుకోవడం లేదని గుర్తించారు. రక్తదాత నుంచి రక్తాన్ని సేకరించిన సమయంలో గానీ, తరువాత గానీ ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రాథమిక చికిత్స అందించే పరిస్థితి అక్కడ లేదు. ఈ సెంటర్‌లో లోపాలను గుర్తించి సమాధానం ఇవ్వాలని కోరుతూ మూడు నెలల కిందట అధికారులు నోటీసులు జారీచేశారు. నెలలు గడిచినప్పటికీ సమాధానం ఇవ్వకపోవడంతో గత నెలలో మరోసారి తనిఖీలు నిర్వహించారు. అప్పటికీ అదే పరిస్థితి కొనసాగడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దానిని ఆధారంగా చేసుకున్న ఔషధ నియంత్రణ, పరిపాలన విభాగం డైరెక్టర్ బ్లడ్ సెంటర్‌ను మూసేయాలంటూ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఔషధ నియంత్రణ, పరిపాలనా విభాగం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది సహాయంతో సెంటర్‌ను క్లోజ్ చేశారు.

కొండపై ఆయనదే పెత్తనం

... 5వ పేజీ తరువాయి

నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టినందుకు ప్రతిఫలం పొందినందున చర్యలకు వెనకాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పరిపాలన అవసరాల పేరుతో మంగళవారం కొందరు అర్చకులను బదిలీ చేశారు.ఎంకేవీవీఎస్ యాజులును భైరవస్వామి ఆలయ అర్చకులుగా నియమించారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఎస్.సంతోష్‌కుమార్ భైరవ స్వామి ఆలయ ఆభరణాలకు బాధ్యులని పేర్కొన్నారు. భైరవ స్వామి ఆలయం అర్చకులు కేఎస్‌వీ సుబ్రహ్మణ్యశర్మను పాత టోల్ గేటు వద్దనున్న సిద్ధి వినాయక ఆలయానికి బదిలీ చేశారు. అక్కడ ఇప్పటివరకూ యాజులు పనిచేశారు. వీరిని ఇటు మార్చారు. కన్సాలిడేటెడ్ పే అర్చకులైన పి.శ్రావణ్‌కుమార్‌ను కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి వేశారు. రెగ్యులర్ అర్చకులైన సంతోశ్‌కుమార్ అక్కడ ఆభరణాలకు బాధ్యులని పేర్కొన్నారు. కృష్ణాపురం గోశాల వద్ద ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయానికి సంభావన అర్చకుల సేవలు ఉపయోగించుకోవాలని భైరవవాక ఆలయ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఇవి కాకుండా అన్నదానం సత్రం, ప్రసాదాల విభాగం, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, శానిటేషన్ విభాగాల్లో మరో పది మందికి బదిలీలు చేశారు. ఇందులో ఓ వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారని విమర్శలు వస్తున్నాయి. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో పనిచేస్తూ నిత్యం అందరితో ఘర్షణ పడే ఓ ఉద్యోగిని గతంలో విజయనగరం బదిలీ చేశారు. ఇప్పుడు ఆయన్ను తీసుకువచ్చి కొండపై పారిశుధ్యం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సదరు ఏఈఓ తన అనుకున్న వారికి ఏమి చేయడానికైనా వెనుకాడరని, ఈ బదిలీలే దానికి నిదర్శనమని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్ల మంజూరు చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని పార్టీ కార్యాయలంలో నియోజకవర్గం పరిధిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇళ్లు మంజూరై బ్యాంకు నుంచి రుణం మంజూరు కాని లబ్ధిదారులకు ప్రైవేటు బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు రంగులు వేసి ప్రచారం చేసుకోవడంతోనే కాలయాపన చేసిందని, లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి బ్యాంక్ రుణం మంజూరు చేసి లబ్ధిదారులకు ఇళ్ల అందించే ప్రక్రియ పూర్తిస్థాయిలో చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

భూలోకమాంబ సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల


అమ్మవారిని దర్శించుకున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

వేపగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో కొలువైన భూలోకమాంబ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేశ్‌బాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల కళాకారులకు 'పీఎం విశ్వకర్మ' ఒక వరం

» గాజువాక బీజేపీ ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తి కళాకారులకు 'పీఎం విశ్వకర్మ' పథకం గొప్ప వరమని గాజువాక బీజేపీ ఇన్‌చార్జి కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా భారత సంప్రదాయ చేతివృత్తుల కళాకారుల కోసం కేంద్రం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులందరికీ పీఎం విశ్వకర్మ పథకం అమలు చేస్తామన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఏడీ చంద్రమౌళి, ఇన్‌చార్జి ఏడీ ఎ.శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలి: ఆర్‌డీవో

మల్కాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లకు తావులేకుండా చూడాలని విశాఖపట్నం ఆర్డీవో సుధాసాగర్ పేర్కొన్నారు. ములగాడ మండలం పరిధిలో ఉన్న బూత్‌లెవెల్ అధికారులు (బీఎల్‌వో)లతో ములగాడ హౌసింగ్ కాలనీలో ఉన్న యాదవ సామాజిక భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల జాబితాలో కొత్త ఓట్లను చేర్చి, చేనిపోయిన వారు ఉంటే వారి ఓటును జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. అలాగే ఓటర్లకు సంబంధిచి అనేక విషయాలను బీఎల్‌వోలు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కూర్మన్నపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కణితి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.నాని, వి.మాధవి, డి. సుజాత, జి. వర్షిణి అండర్-17 బేస్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు నంద్యాల జిల్లా అహోబిలంలో జరగనున్న అండర్ 17 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో వీళ్లు పాల్గొంటారని పాఠశాల పీఈటీలు శారద, దాసు, నారాయణ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్ నరసింగరావు విద్యార్థును అభినందించారు.

ఏబీఎస్ విద్యార్థి ఎంపిక

అగనంపూడి: ఇటీవల జరిగిన జిల్లాస్థాయి బేస్ బాల్ పోటీల్లో ఈ- మర్రిపాలెం ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి సాలాపు రోషిణి ప్రియ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి బేస్ బాల్‌పోటీలకు ఎంపికయ్యంది. ఈనెల 27 నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో పాల్గొననుంది. మంగళవరం రోషిణిప్రియను పాఠశాల అధ్యపకులు అభినందించారు.

ఫైలేరియా రోగులకు పాదరక్షల వితరణ

మల్కాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా షిప్‌యార్డ యాజమాన్యం పార్వతీపురం మన్యం జిల్లాలో బలిజిపేట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెదపెంకి గ్రామంలో 132 మంది ఫైలేరియా రోగులకు వైద్య పాదరక్షకలుఉ, స్వీయసంరక్షణ వైద్య కిట్‌లు మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ అధికారులు మాట్లాడుతూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, శరత్, రామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), సీతా రామయ్య (పరవాడ),
- **కాంత** : మెలోడి, శ్రీకన్య-2 (గాజువాక),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : కిన్నెర(మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల ఫ్రండ్** :శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 50, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు)64, బెండకాయలు 50, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 56, ఆనపకాయ 30,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 56, దొండకాయలు 42, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు56, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 38, కంద 50, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 56, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 68, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

అరకు పార్లమెంటరీ నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిగా శరగడం

పెందుర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అరకు వైసీపీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడిగా పెందుర్తికి చెందిన శరగడం చినఅప్పలనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాలు మేరకు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో శరగడంకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడిగా పనిచేసిన శరగడంకు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ క్రమంలో అరుకు పార్లమెంటరీ పరిధిలో ఉన్న పార్వతీపురం, పలకొండ, కురుపాం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు శరగడం పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. ఈ పదవి తనకు ఇచ్చిన వైఎస్ జగన్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లకు శరగడం కృతజ్ఞతలు తెలిపారు

ఫార్మా కంపెనీల బస్సులకు గడువు పెంపు

గాజువాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీలకు చెందిన బస్సులు గాజువాక ప్రాంతం నుంచి రాకపోకలు సాగించటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. గాజువాక ప్రాంతానికి ఫార్మా బస్సులు రావడానికి అనుమతి లేదని సోమవారం ప్రకటించారు. దీంతో బస్సు యజమానులు, ఫార్మా కంపెనీల ప్రతినిధులు వారం రోజులు గడువు అడగడంతో పోలీసులు సమయం ఇచ్చారు. డిసెంబరు 1వ తేదీ నుంచి నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సుల తనిఖీ

పెందుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో ఉన్న మహతి, బాలాజీ పాఠశాల బస్సులను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తనిఖీలు చేశారు. ట్రాఫిక్ సీఐ కె.సురేశ్, ఎస్ఐ నరసింగరాజు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎమ్‌వీఎస్ ప్రకాశ్ బస్సులకు అన్ని పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలని డ్రైవర్లకు సూచించారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వడ్లపూడికి చెందిన డి.గోపాలకృష్ణ (36) బీఎఫ్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మంగళవారం విధి నిర్వాహణలో ఉండగా వేడి నీరు ఉన్న మిషన్ ఆటోమెటిక్‌గా ఆన్ అయ్యింది. ఈ సమయంలో పైప్ నుంచి అత్యధిక ప్రెజర్‌తో వేడి నీరు గోపాలకృష్ణపై పడ్డాయి. దీంతో తీవ్ర గాయాలు కావడంతో ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. తాము చూసేసరికే అతను మృతి చెందాడని కేజీహెచ్ వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గోపాలకృష్ణకు భార్య, కుమారుడు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయండి : కలెక్టర్


రహదారి పనులను సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వేపగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ తగ్గించేందుకు చేపట్టే రహదారి అనుసంధాన పనులు త్వరగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. వేపగుంట నుంచి శివారు ప్రాంతాలను అనుసంధానం చేసే రహదారులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేపగుంట నుంచి పినగాడి రహదారి విస్తరణపనులు, వేపగుంట నుంచి జుత్తాడ మీదుగా హైవేకు అనుసంధానం చేసే రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ పలు సూచనలు చేశారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

మల్కాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో హార్బర్ సబ్‌డివిజన్ శక్తి టీమ్ ఇన్‌చార్జి ఎస్.కాళిదాసు ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పోలీసుల దృష్టికి తీసురావాలని అన్నారు. అలాగే శక్తి వాట్సప్ నంబరు 79934 85111కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌కు సంబంధించిన ప్లకార్డులను సమావేశంలో ప్రదర్శించారు.